


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | శుక్రవారం 21-11-2025 | సంపుటి : 07 | సంచిక : 191 | పేజీలు : 8 | వెల : రూ 3-00


## ఉల్లాసంగా, ఉత్సాహంగా ప్రధాని మోదీ..

### నెట్టింట్లో ట్రెండింగ్




పాట్నా, నవంబర్ 20: ప్రధాని నరేంద్ర మోదీ ఇవాళ సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతున్నారు. బిహార్లో ఎన్డీయే విజయాన్ని పూర్తిగా ఆస్వాదిస్తున్న ప్రధాని మోదీ, 'గంచా మూమెంట్' తీసుకొచ్చారు. మెడలోని కండువా తీసి తలపై గుండ్రంగా తిప్పుతూ జనాన్ని ఉర్రూతలూగించారు. బిహార్ ముఖ్యమంత్రి నీతీష్ కుమార్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన ప్రధాని ఉదయం నుంచీ చాలా ఉత్సాహంగా కనిపించారు. వేదిక వద్దకు చేరుకునే సందర్భంలో కూడా ప్రధాని తన కండువా గాల్లో ఊపుతూ అక్కడికి చేరుకున్న ప్రజల్ని ఉత్సాహపరిచే యత్నం చేశారు.కాగా, బిహార్‌కు పదవసారి ముఖ్యమంత్రిగా నితీష్ కుమార్ ఇవాళ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోదీ, అమిత్ షా తదితర ఎన్డీయే పెద్దలు హాజరయ్యారు. పాట్నాలోని గాంధీ మైదాన్‌లో జరిగిన ఈ వేడుకకు భారీ ఎత్తున జనం హాజరయ్యారు. ఈ సందర్భంగా పీఎం మోదీ తన కండువాతో జనాల్ని ఉత్సాహపర్చారు.ముఖ్యమంత్రి, మంత్రుల చేత గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్ ప్రమాణ స్వీకారాలు చేయించారు. ముఖ్యమంత్రిగా నితీష్ కుమార్ (జేడీ-యూ), బీజేపీ నేతలు సామ్రాట్ చౌదరీ, విజయ్ కుమార్ సిన్హా ఉప ముఖ్యమంత్రులుగా, మరో 26 మంది మంత్రులుగా ఇవాళ ప్రమాణ స్వీకారం చేశారు.

## ఏపీపై దూసుకెళ్తున్న తుఫాన్



విజయవాడ, నవంబర్ 20,ఏపీవైపు దూసుకొస్తున్న మరో తుపాను.. మూడ్రోజులు ఈ జిల్లాల్లో భారీ వర్షాలు.. వాతావరణశాఖ హెచ్చరికలు జారీఏపీ ప్రజలకు బిగ్ అలర్ట్. రాష్ట్రంలో మళ్లీ వర్షాలు దంచికొట్టనున్నాయి. రాష్ట్రానికి తుఫాన్ ముప్పు పొంచిఉన్నట్లు అమరావతి వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నెల 22వ తేదీన ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే చాన్సు ఉన్నట్లు ఈ సందర్భంగా వెల్లడించింది. ఆ తరువాత 48 గంటల్లో అది మరింత బలపడుతుందని పేర్కొంది.నైరుతి బంగాళాఖాతంలో ప్రస్తుతం అల్పపీడనం కొనసాగుతున్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. దీని కారణంగా ఏపీలోని వచ్చే మూడు రోజులు పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనా వేసింది. ముఖ్యంగా ఇవాళ (గరువారం) ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే చాన్స్ ఉందికృష్ణా, బాపట్ల, ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. మంగళవారం వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలిపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది.మరోవైపు.. రాష్ట్రంలో చలితీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి పడిపోతున్నాయి. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో చలి చుక్కలు చూపిస్తోంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 4.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ సీజన్లో ఇదే అత్యల్పం కావడం గమనార్హం. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ముంచంగిపుట్టులో 5.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా.. చింతపల్లిలో 6.8, డుంబ్రిగుడలో 7.8, పాడేరు, పెదబయలులో 8.1డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.మరోవైపు శ్రీకాకుళం, ఎన్టీఆర్, విజయనగరం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం జిల్లాల్లో కూడా 10 నుంచి 15డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న వారం రోజుల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ విభాగం హెచ్చరికలు జారీ చేసింది.

## ఐబొమ్మ వన్‌పై పోలీసుల క్లారిటీ

ఆన్‌లైన్‌లో మరో పైరసీ వెబ్‌సైట్ గురించి జోరుగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి అరెస్ట్ తర్వాత.. తెరపైకి ఐబొమ్మ వన్ అనే వెబ్‌సైట్ వచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ఈ విషయంపై సైబర్ క్రైమ్ పోలీసులు క్లారిటీ ఇచ్చారు. ఐబొమ్మ వన్ సైట్ ఓపెన్ అవ్వడం లేదని స్పష్టం చేశారు.'ఐబొమ్మ వన్ వెబ్‌సైట్‌లో కొత్త సినిమాలు పైరసీ అయ్యాయన్న ప్రచారంలో వాస్తవం లేదు. అందులో మూవీస్‌కి సంబంధించి రివ్యూస్ మాత్రమే ఉన్నాయి. అది ఓపెన్ చేస్తే మూవీ రూల్జ్‌కి రీడైరెక్ట్ అవ్వడం లేదు. ఐబొమ్మ, బప్పం వెబ్‌సైట్లను ఇప్పటికే బ్లాక్ చేయించాం. వేరే వెబ్ సైట్ల ద్వారా పైరసీకి పాల్పడితే వాటి దిశగా దర్యాప్తు చేస్తాం. మరికొద్ది సేపట్లో ఇమ్మడి రవిని కస్టడీలోకి తీసుకోబోతున్నాం' అని వెల్లడించారు.కరేబియన్ దీవుల్లో పెద్ద నెట్‌వర్క్ ఏర్పరచుకుని బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేయడమే కాకుండా సినిమాలను పైరసీ చేసి అప్‌లోడ్ చేస్తున్నందుకు ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవిని పోలీసులు అరెస్టు చేసి విచారిస్తున్నారు. ఈ నేపథ్యంలో మరో పైరసీ వెబ్ సైట్ ఐబొమ్మ వన్ ప్రత్యక్షమైనట్లు సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఏదైనా సినిమాను క్లిక్ చేస్తే నేరుగా 'మూవీ రూల్జ్'కు రీడైరెక్ట్ అవుతోందని వార్తలు వచ్చాయి. దీంతో సైబర్ క్రైమ్ పోలీసుల క్లారిటీతో వీటికి చెక్ పడింది.




## బిహార్ సీఎంగా నితీశ్ ప్రమాణస్వీకారం

పట్నా, నవంబర్ 20: బిహార్ సీఎంగా జేడీయూ అధినేత నితీశ్ కుమార్ గురువారం ప్రమాణస్వీకారం చేశారు. ఆ రాష్ట్రానికి ఆయన ప్రమాణస్వీకారం చేయడం ఇది పదోసారి. పట్నాలోని గాంధీ మైదానంలో నితీశ్‌తో పాటు 27 మంది మంత్రులు ప్రమాణస్వీకారం చేయగా.. సామ్రాట్ చౌదరీ, విజయ్ కుమార్ సిన్హాలకు డిప్యూటీ సీఎం పదవులు దక్కాయి. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తదితరులు హాజరయ్యారు.బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అదరగొట్టింది. మొత్తం 243 అసెంబ్లీ సీట్లకు నితీశ్ కుమార్ నేతృత్వంలో ఎన్డీయే ఏకంగా 202 సీట్లు దక్కించుకుంది. బీజేపీ 101 సీట్లలో పోటీ చేసి 89 చోట్ల గెలుపొందింది. 101 సీట్లలోనే పోటీ చేసిన జేడీయూ 85 చోట్ల విజయం సాధించింది. తాజాగా ప్రమాణస్వీకారం చేసిన 27 మంత్రుల్లో.. 14 మంది బీజేపీ నుంచి కాగా, 9 మంది జేడేయూకు చెందిన నేతలు. బిహార్‌లో సీఎం నితీశ్ కుమార్ దాదాపు 19 ఏళ్లు పదవిలో ఉన్నారు. 2000 సంవత్సరంలో ఏడు రోజులు మాత్రమే సీఎంగా పని చేశారు.

## కుప్పం ప్రజలకు అండగా ఉంటాం: నారా భువనేశ్వరి



చిత్తూరు, నవంబర్ 20: కుప్పం నియోజకవర్గ ప్రజలకు తాము ఎల్లవేళలా అండగా ఉంటామని సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ భవన్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి భరోసా ఇచ్చారు. కుప్పంలో రెండు రోజుల పర్యటనలో భాగంగా గురువారం శాంతిపురంలోని తన నివాసంలో నారా భువనేశ్వరి గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజల నుంచి అర్జీలను ఆమె స్వీకరించారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో నారా భువనేశ్వరిని కలిశారు. స్వచ్ఛ భారత్ అవార్డులు గెలుచుకున్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులను ఆమె అభినందించారు. దయాళ్ శ్రవణ్ ఫౌండేషన్ స్పాన్సర్ చేసిన వినికిడి పరికరాలను పంపిణీ చేశారు.అనంతరం డీకే పల్లి వద్ద కృష్ణా జలాలకు ఆమె జల హారతి ఇచ్చారు. అంతకు ముందు గంగమ్మ ఆలయంలో నారా భువనేశ్వరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కృష్ణమ్మకు చీర సారె అందించడం తన పూర్వ జన్మ సుకృతమని ఆమె పేర్కొన్నారు. కుప్పంలో ఇలా శ్రీశైలం నుంచి వచ్చిన కృష్ణా జలాలను చూడడం తన జన్మలో మర్చిపోలేని అనుభూతిని ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో మహిళలు తరలి వచ్చారు.కుప్పంలో నారా భువనేశ్వరి నాలుగు రోజుల పాటు పర్యటించనున్నారు. అందుకోసం బుధవారం ఆమె కుప్పం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. కుప్పం, శాంతిపురం, గుడిపల్లి, రామకుప్పం మండలాల్లో నారా భువనేశ్వరి పర్యటించనున్నారు.

## సేవా సంకల్పం ప్రశంస ఐఎంఏను అభినందించిన మంత్రి ఫరూక్--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 20-నంద్యాల ఐఎంఏ నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ ను ఆయన క్యాంపు కార్యాలయంలో ఐఎంఏ నంద్యాల నూతన కార్యవర్గం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో ఐఎంఏకు చెందిన సుమారు 500 మంది వైద్యులు ప్రజలకు నిరంతర మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. సామాజిక సేవలు, ఉచిత వైద్య శిబిరాల ద్వారా పేదలకు అండగా నిలుస్తున్న ఐఎంఏను అభినందిస్తూ ఇదే సేవా దృక్పథాన్ని కొనసాగించాలని సూచించారు.ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ గత ఏడాది నంద్యాల ఐఎంఏ నిర్వహించిన కార్యక్రమాలకు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ శాఖ పురస్కారం, ఉత్తమ మహిళా వైద్య విభాగ సామాజిక సేవా పురస్కారం లభించాయని, అలాగే డాక్టర్ మధుసూదనరావుకు ఉత్తమ అధ్యక్షుడు పురస్కారం ప్రకటించారని తెలిపారు. ఈ పురస్కారాలు ఈ నెల 22న రాజంపేటలో జరిగే రాష్ట్ర స్థాయి ఐఎంఏ సదస్సులో ప్రదానం చేయనున్నట్లు మంత్రికి వివరించారు.తదుపరి ఐఎంఏ నాయకులు మంత్రి ఫరూక్ ను శాలువా గజమాలతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన రెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, ఐఎంఏ నంద్యాల నూతన అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసరావు, కార్యదర్శి డాక్టర్ మహమ్మద్ రఫీ, మహిళా వైద్య విభాగం అధ్యక్షురాలు డాక్టర్ మాధవి, కార్యదర్శులు డాక్టర్ సునీత, డాక్టర్ శైలజ, మాజీ అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు, అకాడమిక్ విభాగం కార్యదర్శి డాక్టర్ లలిత, మిషన్ పింక్ హెల్త్ సమన్వయకర్త డాక్టర్ ఆరిఫా భాను తదితరులు పాల్గొన్నారు.







# సంపాదకీయం

శుక్రవారం 21-11-2025

## పని చేయని ఓటు చోరీ

స్వాతంత్ర్య సాధన ఉద్యమ పార్టీగా, స్వతంత్ర భారతదేశా న్ని అత్యంత ఎక్కువకాలం పాలించిన పార్టీగా కాంగ్రెస్‌కు పేరుంది. కానీ కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం రాజకీయంగా అత్యంత గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నది. అటు పార్లమెంట్ ఎన్నికల్లోనూ, ఇటు ఆయా రాష్ట్రాల్లోనూ సొంతంగా పోటీచేసినా, అవసరాన్ని బట్టి ఇతర పార్టీలతో కూటమిగా ఏర్పడి పోటీచేసినా పెద్దగా ప్రభావం చూపలేకపోతుంది. కొంతకాలంగా ఆయా ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి ఓడిపోవడంపై ఆ పార్టీ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ఆసక్తికరమైన ఆరోపణలు చేస్తున్నారు. దేశ వ్యాప్తంగా కేంద్రంలోని బీజేపీ, కేంద్ర ఎన్నికల కుమ్మక్కు అయి ఓట్ చోరీకి పాల్పడుతుందని తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ముఖ్యంగా మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు చోరీ జరిగిందని పలు సమావేశాలు నిర్వహించి కూడా ప్రజలకు వివరించే ప్రయత్నం చేశారు. బీహార్ ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి ఘోరమైన పరాభవాన్ని మూటగట్టుకున్నది. కానీ బీహార్‌లో కూడా ఓట్ చోరీ జరిగిందని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తుంది. దీనికి ప్రధాన కారణం బీహార్ ఎన్నికల ముందు ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్(ఎస్ఐఆర్) పేరిట రాష్ట్రంలోని 65 లక్షల మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించింది. అయితే ఈ అంశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దఎత్తున పోరాటం చేశారు. కానీ ఫలితాల్లో ఇది ఎలాంటి ప్రభావమూ చూపలేదు.కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న సంస్థాగత లోపమే కారణమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ కేవలం ఆయా అంశాలకు సంబంధించిన ఆరోపణలకు మాత్రమే పరిమితమవుతుందని, వాటిని నిరూపించే ప్రయత్నం, వాస్తవాలను బహిర్గతం చేసే ప్రయత్నం గానీ చేయడం లేదని స్పష్టం చేస్తున్నారు. రాజకీయంగా సానుకూలంగా మార్చుకోగలిగే పరిణామాలను కూడా పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోలేకపోతుంది.ఇలాంటి పరిస్థితుల కారణంగా కాంగ్రెస్ పార్టీ రోజురోజుకూ దేశవ్యాప్తంగా రాజకీయ పట్టును కోల్పోతుందని హెచ్చరిస్తున్నారు. దీనికి బీహార్ ఎన్నికలే ప్రత్యక్ష నిదర్శనమని ఉదాహరిస్తున్నారు. బీహార్ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పార్టీ నాయకులతో ఇటీవల ఒక సమావేశాన్ని నిర్వహించారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ముసాయిదా ఓటరు జాబితాల నుంచి 65 లక్షల మందిని తొలగించడంతో అభ్యంతరం తెలుపుతూ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీంతో ఓటర్ల జాబితాలో ఏర్పడిన సందిగ్ధతపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని కొలిక్కి తీసుకొచ్చే ప్రయత్నం చేసింది. తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల వివరాలను తమకు అందించాలని ఈసీని సుప్రీంకోర్టు ఆదేశించింది.ఆ ఓటర్లను ఏ ప్రాతిపదికన తొలగించారో తాము కూడా తెలుసుకుంటామని స్పష్టంచేసింది. అదేవిధంగా తొలగించిన ఓటర్ల వివరాలతో కూడిన కాపీని ఏడీఆర్‌కు కూడా అందించాలని స్పష్టం చేసింది. బీహార్‌లో ఎస్ఐఆర్ కోసం ఈసీ జారీచేసిన ఆదేశాలను ఏడీఆర్ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. దీంతోపాటు తాజాగా తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల పేర్లు, వివరాలను బహిరంగంగా ప్రకటించేలా ఆదేశాలు ఇవ్వాలని మరో పిటిషన్ దాఖలు చేసింది.జాబితాల నుంచి తీసేసిన ఓటర్లు మృతిచెందారా?. శాశ్వతంగా వలసపోయారా?. అనే విషయాలను స్పష్టం చేయాలని కోరింది. ఆ సంస్థ ఫిర్యాదుపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల సంఘం తొలగించిన ఓటర్ల వివరాలు, తొలగింపునకు గల కారణాలను వెల్లడించింది. బీహార్ ఓటర్ల జాబితా నుంచి కేంద్ర ఎన్నికల సంఘం 65 లక్షల మందిని తొలగించింది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో భాగంగా సంబంధిత ఫారాలను సమర్పించడానికి గడువుకు ఒక రోజు ముందే వారందరినీ ఓటర్ల జాబితా నుంచి తొలగించనున్నట్టు తెలిపింది. లిస్టు నుంచి తీసేసే ఓటర్లలో 21.6 లక్షల మంది మరణించారని, 31.5 లక్షల మంది శాశ్వతంగా బీహార్ వదిలి వెళ్లారని, 7 లక్షల మంది రెండు ప్రదేశాలలో ఓటర్లుగా నమోదు చేసుకున్నారని, లక్ష మంది ఆచూకీ తెలియడం లేదని ఈసీ పేర్కొంది.భారీగా ఓటర్లను తొలగిస్తే బీహార్‌లోని 243 అసెంబ్లీ స్థానాల్లో సగటున ఒక్కో నియోజకవర్గానికి 25 వేలకు పైగా పేర్లు డిలీట్ అయ్యాయి. అయితే ఈ పరిణామం బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిందని విశ్లేషకులు భావిస్తున్నారు. గత ఎన్నికల్లో అనేక స్థానాల్లో పలువురు అభ్యర్థులు స్వల్ప తేడాతో విజయం సాధించారని గణాంకాలు చెబుతున్నాయి. దీంతోపాటు ప్రస్తుతం ఎన్నికల సంఘం ఆయా నియోజకవర్గాల్లో తొలగించిన ఓట్ల కంటే తక్కువ తేడాతో కూడా ఓడిపోయారు.అయితే ఈసీ నిర్ణయాన్ని ప్రతిపక్ష కాంగ్రెస్, ఆర్జేడీలు వ్యతిరేకించాయి. దీనిని తొందర పాటు చర్యగా అభివర్ణిస్తూ నిరసనలు కూడా తెలుపుతున్నాయి. అయితే ఓటర్ జాబితా నుంచి 65 లక్షల మందిని తొలగించిన కాంగ్రెస్ పార్టీ కేవలం ఆరోపణలకు, నిరసనలకు మాత్రమే పరిమితమైంది. జాబితా సరి చేయడంలో తమ వంతు బాధ్యతను విస్మరించింది. ఫలితంగా ఎన్నికల ఫలితాల్లో ఘోరంగా భంగపాటుకు గురైందివాస్తవానికి ఎస్ఐఆర్ పేరుతో ఓటర్లను తొలగించినప్పటికీ అభ్యంతరం ఉన్న వారు సరైన పత్రాలు చూపించి తిరిగి నమోదు చేసుకోవచ్చు. జాబితాలో తిరిగి నమోదు చేయించుకునేందుకు నెల రోజుల గడువు ఇచ్చినా దీనిని కాంగ్రెస్ వినియోగించుకోలేదని వాదనలు వినిపిస్తున్నాయి.

## గిరిజన సంక్షేమ శాఖలోని బ్యాక్ లాగ్ పోస్టులను గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలి.

### అదనపు కలెక్టర్ విజయ లక్ష్మికి వినతి
### గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి రాజేందర్

జయశంకర్ భూపాలపల్లి.నవంబర్ 20,గిరిజన సంక్షేమ శాఖలోని బ్యాక్ లాగ్ పోస్టులను గిరిజనులకే కేటాయించి నిరుద్యోగ ఆదివాసీ బిడ్డలకు ఉద్యోగ అవకాశం కల్పించాలని గురువారం జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి కి గిరిజన సంఘం నాయకులు వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న బ్యాక్ లాగ్ ఉద్యోగాలను గత కొన్ని సంవత్సరాలుగా కాంట్రాక్టు మరియు ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేస్తున్నారు. వాటి కాల పరిమితి ఒక సంవత్సరం మాత్రమే కాని రిన్యూవల్ పేరుతో వాటిని యధావిధిగా ప్రభుత్వం కొనసాగిస్తున్నారని. దీనితో ఏజెన్సీ ప్రాంతం లోని ఆదివాసీ యువత ఉద్యోగ నోటిఫికేషన్ కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది అన్నారు గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో దాదాపు 3431 వివిధ ఉద్యోగాలు కాంట్రాక్టు మరియు ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన కొనసాగిస్తున్నారు అని, ఇందులో 1600 రెగ్యులర్ ఉద్యోగాలు, వీటిలో అత్యధికంగా 1317 ఉపాధ్యాయ పోస్టులు ఉన్న రెగ్యులర్ గా నింపకుండా ప్రభుత్వం మోసం చేస్తుంది అని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీగా ఉండి సాంక్షన్ కానీ వాటిని వెంటనే సాంక్షన్ చేసి అన్నిటినీ రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు ఏజెన్సీ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి అని. అలాగే నాలుగేళ్లుగా ట్రైకార్ రుణాలు అందక ఆదివాసీ యువత నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని,వెంటనే ట్రైకర్ రుణాలు మంజూరు చేయాలని, ఆదివాసీ యువతను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే సీ ఎం ఎస్ టీ ఈ ఐ పథకం అమలు కావడం లేదాంటే , యువత పట్ల ప్రభుత్వాలకు ఏమి బాధ్యత వున్నట్టు అని ప్రశ్నిచారు. యువత పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడలన్నారు, వెంటనే ఈ డిమాండ్స్ ని నెరవేర్చక పోతే పెద్ద ఎత్తున పోరాటాలకు పూనుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు అసోదుల కుమార్,ఆదివాసీ విద్యార్థి నాయకులు మడకం నిర్మా, వారితోపాటు వ్యవసాయ కార్మిక సంఘం ఎస్ఎఫ్ఐ కెవిపిఎస్ నాయకులు ఆత్కూరి శ్రీకాంత్ కుమార్ రాజ్ కుమార్ బొడ్డు స్మరణ ఆత్కూరి శ్రీధర్ తదితరులు ఉన్నారు.

## జాతీయ సదస్సుకు టీజీఎస్ఆర్టీసీ కార్మిక సంఘాలకు ఆహ్వానం



హైదరాబాద్, నవంబర్ 20 : కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న విద్యుత్ బస్సుల విధానంలో సంపూర్ణ మార్పులు చేసి ఆర్టీసీలకే బస్సుల కొనుగోలు, నిర్వహణ, ఆపరేషన్ కు అవకాశం కల్పించాలని, ఈ పథకం కోసం ఖర్చు చేస్తున్న డబ్బులు ఆర్టీసీలకే ఇవ్వాలన్న డిమాండ్ పై ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23న చెన్నైలో జాతీయ సదస్సు జరుగనుంది. ఈ సదస్సుకు దేశంలోని 56 ఆర్టీసీల నుండి కార్మిక సంఘాల నాయకులు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో సదస్సుకు హాజరై అభిప్రాయాలు తెలుపాల్సిందిగా కోరుతూ టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆర్టీసీ కార్మిక సంఘాలకు ఆహ్వానం అందజేసింది.కాలుష్యం నియంత్రణ పేరుతో దేశంలో ఉన్న 1,40,000 ఆర్టీసీ బస్సులను విద్యుత్ బస్సులుగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం విధాన నిర్ణయం చేసి అమలు చేస్తుంది. ఇప్పటికే ఈజీఎవ1, ఈంఓఇ-2, ఖఓఇ-ఃబీబ, ఖఓ వ డ్రైవ్ పథకాలతో, పీపీపీ మోడల్‌లో జీసీసీ కాంట్రాక్ట్ పద్ధతిని అమలు చేస్తూ సబ్సిడీలను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతుంది. తెలంగాణ ప్రభుత్వం కూడా హైదరాబాద్ నగరంలో 2 వేల బస్సులను విద్యుత్ బస్సులుగా మార్చాలని విధాన నిర్ణయం చేసిన సంగతి తెలిసిందే.ఈ విధానం వల్ల ఆర్టీసీలు మరింత నష్టాల ఊబిలోకి వెళ్తాయని, భవిష్యత్‌లో ఆర్టీసీ బస్సులు కనమరుగయ్యే ప్రమాదంతో పాటు, కొత్త ఉద్యోగాల కల్పన లేకపోవడమే కాక ప్రస్తుతం ఉన్న కార్మికుల ఉద్యోగ భద్రత కూడా ప్రమాదంలో పడనున్నదని ఎస్‌డబ్ల్యూఎఫ్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు, వీ.ఎస్.రావులు అన్నారు. సంస్థ మనుగడకు, కార్మికుల హక్కుల పరిరక్షణకు జాతీయ సదస్సులో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నట్లు వారు వెల్లడించారు.

## శిశు విక్రయాలు, బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి : కేవీ కృష్ణవేణి



నీలగిరి, నవంబర్ 20 : జిల్లాలో ఆడ శిశువుల విక్రయాలు, బాల్య వివాహాలు, బాలికలపై లైంగిక అత్యాచారాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని నల్లగొండ జిల్లా మహిళ శిశు సంక్షేమ అధికారి కేవీ కృష్ణవేణి అన్నారు. గురువారం నల్లగొండ పట్టణంలోని చర్లపల్లి సెక్టార్ పరిధిలో అంగన్‌వాడీ టీచర్లు, బాలింతలు, గర్భిణీలకు బాల్య వివాహాలు, అక్రమ దత్తత, బాలికలపై లైంగిక వేధింపుల నిరోధంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో ప్రజలకు అవగాహన లేకపోవడం వల్ల ఆడ పిల్లలను అక్రమంగా దత్తత ఇవ్వడం, బాల్య వివాహాలు చేస్తున్నారని వీటిపై అవగాహన కల్పించాలన్నారు.ఆడ పిల్లలను సంరక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని, బాల్యవివాహాలు అరికట్టే బాధ్యత తల్లిదండ్రులపై కూడా ఉందన్నారు. ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడితే వెంటనే సమాచారం అందజేయాలన్నారు. ఈ విషయంలో సీడీపీఓలు, సూపర్‌వైజర్లు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. ఫోక్సో చట్టం, బాల్య వివాహాలు, చిన్న వయసులోనే గర్భం దాల్చడం, అక్రమ దత్తత, యువత మత్తు మందులకు బానిసలు కాకుండా ఉండే అంశాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు.నల్లగొండ సీడీపీఓ తూముల నిర్మల మాట్లాడుతూ.. ఆడపిల్లల అక్రమ దత్తత, బాల్య వివాహాలు తదితర అంశాలపై అందరికీ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేకించి ఆడబిడ్డ సంరక్షణపై అవగాహన కల్పించాలని, మీ ప్రాంతాలపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించి అడపిల్ల ఇంటికి బలం అనే విషయాన్ని స్పష్టంగా తెలియజేయాలన్నారు. అనంతరం నల్లగొండ మాజీ జడ్పీటీసీ గుమ్ముల మోహన్ రెడ్డి ఎన్టీఆర్ కాలనీలోని గర్భిణీలకు, బాలింతలకు, చిన్నారులకు సబ్బులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పార్వతి, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మమ్మ, లావణ్య, ఉపశ్రీ, సువర్ణ, సుజాత, స్వరలత, పుష్ప, మోహినుద్దిన్, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

## అల్వాల్ లో హైడ్రా అధికారులను అడ్డుకున్న అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు

మేడ్చల్,అల్వాల్ సర్కిల్, ఓల్డ్ ఆల్వాల్ అంబేద్కర్ నగర్ లో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం మరియు వజ్ర ఎంక్లేవ్ మధ్య నెలకొన్న స్థల వివాదం హైడ్రా ఫిర్యాదు చేయడంతో హైడ్రా అధికారులు కంచె వేయడానికి వచ్చారు. దీంతో అంబేద్కర్ నగర్ కాలనీవాసులు వారిని అడ్డుకోవడం జరిగింది. మధ్యాహ్నం మూడు గంటలకు హైడ్రా కార్యాలయంలో కమిషనర్ రంగనాథ్ సమక్షంలో పరిష్కరించే మార్గం ఉన్నదని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం సబ్యులు తెలిపారు. 30 ఏళ్ల కిందట భూమి యజమాని హరినాధరావు రెండువేల పైచిలుకు గజాల స్థలమును పార్కు కోసం ఇచ్చారని, 1986లో భవనం కోసం పిల్లర్లు కూడా వేశామని, అప్పుడు లేని ఈ స్థలం తగాదా ఇప్పుడు ఎందుకు వచ్చిందని హైడ్రాసిబ్బందిని నిలదీయడం జరిగిందన్నారు. అంబేద్కర్ కాలనీ నివాసులు మూకుమ్మడిగా నిరసన వ్యక్తం చేశారు. ఇటీవలనే ఎన్నికైన వజ్ర ఎన్క్లేవ్ కాలనీ నూతన కమిటీ వాళ్లు ఈ స్థలమును కబ్జా చేయాలని చూస్తున్నారని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సివిల్ యాదగిరి, యాదలయ్య నాగమయ్య, ఢిల్లీ పరమేష్ , శంకర్, రాజయ్య, ఆనంద్, రామకృష్ణ, ఎల్లమయ్య, గోరెమియా, హంజద్ ఖాన్, మహిళలు పాల్గొన్నారు..


## కాంగ్రెస్, బీజేపీ కలిసి కేటీఆర్‌పై కుట్ర : వేముల ప్రశాంత్ రెడ్డి




హైదరాబాద్ : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కక్ష సాధింపు చర్యలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ పార్టీని కట్టడి చేయడానికి బీజేపీ, కాంగ్రెస్ కలిసి కేటీఆర్‌పై కుట్రలు చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు.ఎలాంటి అవినీతి జరగని ఫార్ములా ఈ కార్ రేస్‌లో విచారణకు ఏసీబీ అనుమతి ఇస్తూ గవర్నర్ అనుమతి తెలపడంతో కాంగ్రెస్, బీజేపీలు కలిసి కేటీఆర్‌పై కుట్రలు చేస్తున్నాయనేది తేటతెల్లామైంది. ఇచ్చిన హామీలు అమలు చేయలేక ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చినపుడు, ఎన్నికలు వచ్చినపుడు ఇలాంటి కేసుల అంశాన్ని తెరపైకి తెచ్చి రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాడు అని ప్రశాంత్ రెడ్డి ధ్వజమెత్తారు.రెండేండ్లుగా ఫార్ములా ఈ రేస్‌పై విచారణ పేరుతొ కొండను తవ్వి ఎలుకను పట్టలేకపోయారు. ఇప్పుడు మళ్ళీ స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మరల్చేందుకు కక్షపూరిత రాజకీయాలకు కాంగ్రెస్ తెరలేపింది. అందులో భాగంగానే విచారణ పేరిట కేటీఆర్‌ను ఇబ్బంది పెట్టాలని రేవంత్ రెడ్డి చూస్తున్నాడు. ఫార్ములా ఈ కార్ రేస్‌తో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ని పెంచి తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచ వ్యాప్తం చేసిండు కేటీఆర్. అక్రమ కేసులతో కేటీఆర్, బిఆర్ఎస్ నాయకులను కట్టడి చేయగలం అనుకోవడం పొరపాటే. మీరెన్ని అక్రమ కేసులు పెట్టిన ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు అయ్యేవరకు, కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజల్లో ఎండగడుతూనే ఉంటాం. కేటీఆర్‌కు బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉంటుందని ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. న్యాయస్థానాలపై మాకు పూర్తి నమ్మకం ఉంది.. మీరు చేసే కుట్రలను న్యాయస్థానాల్లో ఎదుర్కొంటాం అని ఆయన పేర్కొన్నారు.

## '20 వేల పోస్టులతో పోలీస్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలి'

### ప్రభుత్వానికి నిరుద్యోగ జేఏసీ డిమాండ్




హైదరాబాద్, నవంబర్ 20 : రాష్ట్ర పోలీస్ శాఖలోని అన్ని విభాగాల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు తక్షణమే 20 వేల పోస్టులతో ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వాలని పోలీస్ ఉద్యోగాల నిరుద్యోగ జేఏసీ ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఇప్పటికే టీజీఎల్పీఆర్బీ బోర్డుకి, మంత్రులందరికీ కూడా వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. అయినా ఎటువంటి స్పందన లేదని దుయ్యబట్టారు. నిరుద్యోగులను ఆదుకుంటామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను నమ్మించి గొంతు కోసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేండ్లు కావొస్తున్నా ఒక్క పోలీస్ ఉద్యోగం భర్తీ చేయలేదని విమర్శించారు. విడుదల చేసే నోటిఫికేషన్‌లో వయో పరిమితిని 35 ఏండ్లకు పెంచాలని, అలాగే జీఓ నంబర్ 46ను రద్దుచేసి, లాంగ్‌జంప్‌ను 3.8 మీటర్లకు తగ్గించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల లోపు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకపోతే ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామని జేఏసీ ప్రతినిధులు ఆకాశ్, శంకర్, వంశీ, నవీన్ పట్నాయక్. శింబునాయక్, సందీప్, చెర్రీ ప్రవీణ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలి : జాన్ వెస్లీ

జనగామ చౌరస్తా, నవంబర్ 20 : ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. గురువారం జనగామ పట్టణంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మావోయిస్టులను వచ్చే మార్చిలోపు ఏరి వేస్తామని స్వయంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాట్లాడడం రాజ్యాంగ విరుద్ధం అని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆదేశిస్తే, అమిత్ షా అమలు చేస్తున్నాడని పేర్కొన్నారు. డెడ్ లైన్‌లు పెట్టి మరీ మావోయిస్టుల ప్రాణాలు తీయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు.కేంద్ర ప్రభుత్వం చేస్తున్న బూటకపు ఎన్ కౌంటర్లను ప్రజాస్వామిక వాదులు ఖండించాలని కోరారు. లొంగి పోవడానికి వచ్చిన మావోయిస్టులను కేంద్ర బలగాలు పట్టుకొని కాల్చి చంపుతున్నారని విమర్శించారు.

ఏ వ్యక్తిని కూడా చంపే అధికారం ప్రభుత్వానికి కానీ పోలీసులకు కానీ లేదన్నారు. ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న మావోయిస్టు అగ్రనేత తిరుపతిని న్యాయస్థానం ఎదుట ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. జరుగుతున్న బూటకపు ఎన్ కౌంటర్లపై న్యాయస్థానాలు సుమోటోగా కేసు నమోదు చేసి విచారణ జరపాలని సూచించారు. దేశంలో మనుధర్మ శాస్త్రాన్ని బీజేపీ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.సామాజిక, రాజకీయ అసమానతలు ఉన్నంతకాలం ఉద్యమాలు ఉంటాయని తెలిపారు. పోరాటాలు, ఉద్యమాలను ఆపడం మోదీ కాదు కదా తను తాత వల్ల కూడా కాదని ఎద్దేవా చేశారు. నియంత హిట్లర్ లాంటి వాళ్లనే మట్టికరిపించిన చరిత్ర ఎర్రజెండాకు ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా దేశంలో జరుగుతున్న ఉగ్రవాద చర్యలను మతపరంగా, రాజకీయంగా బిజెపి సర్కార్ ఉపయోగించుకుంటుందని విమర్శించారు. ఢిల్లీలో జరిగిన ఉగ్రవాద చర్యను బీహార్ ఎన్నికకు ముందు బీజేపీ ఉపయోగించుకోవడం దీనికి ఉదాహరణ అని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ అబ్బాస్, జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి, పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్, రాపర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

# స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ తప్పదా

విశాఖపట్టణం నవంబర్ 20, ఆంధ్రప్రదేశ్ లో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం మరోసారి తెరపైకి వస్తోంది. ఎన్ని వేల కోట్లు తెచ్చి పోసినా లాభాలు రాకుండా తెల్లఏనుగులా మారితే ఎంత కాలం అని భరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నేరుగా వ్యాఖ్యానించడం చర్చనీయాంశమవుతోంది. సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ ముగింపు సమయంలో మీడియాతో మాట్లాడిన చంద్రబాబు, ప్లాంట్‌ను 'వైట్ ఎలిఫెంట్' అని, ఉద్యోగులు 'ఇంట్లో కూర్చొని జీతాలు తీసుకుంటున్నారు' అని విమర్శించారు. "ప్రభుత్వం ఎప్పటికీ డబ్బు ఇస్తుందా? ఉద్యోగులు కష్టపడి పని చేసి లాభాలు తెచ్చి, ప్రైవేటీకరణకు అడ్డుకట్ట వేయాలి" అని అన్నారు. ఈ మాటలు ప్రైవేటీకరణకు ముందస్తు సంకేతమా అనే చర్చకు కారణమయ్యాయి.వైజాగ్ స్టీల్ ప్లాంట్ గత కొన్ని సంవత్సరాలుగా నష్టాల్లో మునిగిపోయింది. 2024లో రూ.4,000 కోట్లు నష్టం వచ్చింది. కేంద్రం ఫిబ్రవరి 2025లో రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించింది. ప్రైవేటీకరణ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసి ఆపేసింది. కేంద్రం రఇచ్?చన ప్యాకేజీతో ప్లాంట్ బతికిందని ఇక ప్రైవేటీకరణ లే లేనట్లేనన్నారు. కానీ ఆ తర్వాత కూడా స్టీల్ ప్లాంట్ పరిస్థితి మెరుగుపడలేదు. ఉద్యోగులు పని చేయడం లేదన్న నివేదికలు ఉండటంతోనే చంద్రబాబు ఇలా వ్యాఖ్యానించారని చెబుతున్నారు. ఆ అనుమానాలను నిజం చేస్తూ.. ఉత్పత్తి ఆధారితంగా జీతాలు చెల్లిస్తామన్న ఉత్తర్వులు స్టీల్ ప్లాంట్ యాజమాన్యం జారీ చేసింది. నవంబర్ జీతాలు ప్రొడక్షన్ టార్గెట్‌లకు లింక్ చేశారు. ఇది ఉద్యోగుల్లో భయాన్ని మరింత పెంచింది.చంద్రబాబు ప్లాంట్‌ను ప్రొఫెషనల్‌గా నడపాలని కోరుతున్నారు. ఉద్యోగులు కష్టపడాలని చెప్పడం మేనేజ్‌మెంట్ సంస్కరణలకు సంకేతం అనుకోవచ్చు. కేంద్ర ప్యాకేజీతో ప్రైవేటీకరణ ఆగిపోయింది కానీ.. ఎలా ఎప్పటికీ గాడిన పడకుండా.. నష్టాలు వస్తూంటే..ఎప్పటికప్పుడు నిధఉలు తెచ్చి పూడుస్తారని అర్థం కాదని చంద్రబాబు నేరుగా చెబుతున్నారు. ప్రైవేటు కంపెనీలు పెద్ద ఎత్తున లాభాలు సంపాదిస్తూంటే అన్ని వనరులు ఉండి కూడా ఎందుకు స్టీల్ ప్లాంట్ కు లాభాలు రావడం లేదని చంద్రబాబు ప్రశ్నిస్తున్నారు. అయితే చంద్రబాబు మాటల్ని విపక్షాలు, యూనియన్లు దీన్ని 'ప్రైవేటీకరణకు మార్గం'గా చూస్తున్నాయి. ప్లాంట్‌కు క్యాప్టివ్ మైన్స్ లేకపోవడం వల్లే నష్టాలు వస్తున్నాయని వారంటున్నారు. వాలంటరీ రిటైర్మెంట్ స్కీమ్ ఉద్యోగులను తొలగించాలనే ప్లాన్ కూడా చేస్తున్నారని ఉద్యోగ సంఘాలు అనుమానిస్తున్నాయి. ప్లాంట్ లాభాల్లోకి వస్తే మాత్రమే ప్రైవేటీకరణ ఆగుతుందన్నట్లుగా చంద్రబాబు మాటలు ఉన్నాయి. అదే పనిగా నష్టాలు వస్తూంటే.. కేంద్రం కూడా నిధులు ఇవ్వదు. అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిట్టల్ లక్షన్నర కోట్లతో ప్లాంట్ పెట్టేందుకు ముందుకు వస్తోంది. ఆ కంపెనీ పూర్తి స్థాయి ప్రైవేటు కంపెనీ. ఆ కంపెనీ వస్తే విశాఖ స్టీల్ ప్లాంట్ కు మరిన్ని సమస్యలు వస్తాయని భావిస్తున్నారు. ఆ కంపెనీ కోసం స్టీల్ ప్లాంట్ ను నిర్వీర్యం చేస్తారన్న అనుమానాలు కొంత మంది లో వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి సమయంలో ఉద్యోగులు కష్టపడి పని చేసి లాభాల్లోకి తీసుకు వస్తే.. అప్పుడు ఏమీ చేయలేరని అంటున్నారు. ఇప్పుడు స్టీల్ ప్లాంట్ ను కాపాడుకోవాలంటే అది ఉద్యోగుల్లో చేతుల్లోనే ఉందంటున్నారు.

# హ్యాపినెస్ట్ హోమ్ మళ్లీ ప్రారంభం

విజయవాడ, నవంబర్ 20, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఐదేళ్లపాటు నిలిచిపోయిన మెగా రెసిడెన్షియల్ ప్రాజెక్టు "హ్యాపీనెస్ట్"కు ముందడుగు పడింది. రాజధాని నిర్మాణంపై కూటమి ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధతో ఈ పనులు ఊపందుకోనున్నాయి. సీఆర్డీఏ అధికారులు ఇచ్చిన తాజా వివరాల ప్రకారం, ఈ ప్రాజెక్టు నిర్మాణ కార్యక్రమాలు వచ్చే సంవత్సరం జనవరి నుంచి జెట్ స్పీడ్‌లో ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే అక్టోబర్ 2025 నాటికే పైల్ ఫౌండేషన్ పనులు పూర్తయ్యాయి, మెయిన్ స్ట్రక్చర్ నిర్మాణానికి పునాదులు పడ్డాయి.హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు చరిత్రను పరిశీలిస్తే, 2017-18 కాలంలో ప్రకటించారు. అప్పట్లో మధ్యతరగతి ప్రజలకు అత్యంత అద్భుతమైన అవకాశం కావడంతో, ఈ ఫ్లాట్లు "హాట్ కేకుల్లా" అమ్ముడుపోయాయి. భారీగా దరఖాస్తుదారులు దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చి కూడా ఈ ఫ్లాట్లను సొంతం చేసుకోవడానికి ఉత్సాహపడ్డారు. అయితే, 2019 నుంచి 2024 వరకు వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజధాని స్థితిపై అనిశ్చితి నెలకొనడంతో ప్రాజెక్టు పూర్తిగా నిలిచిపోయింది. నాటి ప్రభుత్వం దరఖాస్తుదారుల సొమ్ము తిరిగి ఇచ్చేయాలని నిర్ణయం తీసుకుంది.

కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ మొదలు

2024 నవంబర్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు పునరుజ్జీవనం పోసుకుంది. పాత ప్రాజెక్టును కొనసాగించాలని నిర్ణయం తీసుకున్న సీఆర్డీఏ... ఎన్‌సీసీ సంస్థకు నిర్మాణ బాధ్యతలు అప్పగించింది. దీంతో దరఖాస్తుదారుల ఆశలు మళ్లీ చిగురించాయి.

ప్రాజెక్టు పరిధి: వివరాలు ఏంటి?

హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు దాదాపు 15 ఎకరాల (14.46 ఎకరాలు) విస్తీర్ణంలో నిర్మితమవుతోంది. ఇది సుమారు ?930 కోట్ల నుంచి ?985 కోట్ల అంచనా వ్యయంతో కూడిన నిర్మాణం.

? మొత్తం టవర్లు: 12 టవర్లు.

? అంతస్తులు: ప్రతి టవర్‌లో జీ+18 అంతస్తులు (గ్రౌండ్ ఫ్లోర్ + 18 ఎత్తైన అంతస్తులు). కొన్ని చోట్ల జీ+19 అంతస్తులుగా కూడా ఉన్నాయి.

? మొత్తం ఫ్లాట్లు: 1,200 ఫ్లాట్లు.

ఫ్లాట్‌ల రకాలు: సింగిల్ బెడ్‌రూమ్, డబుల్ బెడ్‌రూమ్, ట్రిపుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌లు అందుబాటులో ఉన్నాయి.

వివిధ బడ్జెట్‌లలో అందుబాటులో ధరలు

ఈ ప్రాజెక్టు విభిన్న బడ్జెట్‌ల వ్యక్తులకోసం ఏర్పాటు చేశారు. ధరల వివరాలను సీఆర్డీఏ స్పష్టం చేసింది:

| ఫ్లాట్ రకం | ధర రేంజ్ | నిర్మాణ వివరాలు |
|---|---|---|
| సింగిల్ బెడ్‌రూమ్ | రూ.60 లక్షలు నుంచి | నిర్ణయించాల్సి ఉంది |
| డబుల్ బెడ్‌రూమ్ | రూ.80 లక్షలు నుంచి రూ.1 కోటీ వరకు | నిర్ణయించాల్సి ఉంది |
| ట్రిపుల్ బెడ్‌రూమ్ | రూ.1 కోటీ నుంచి రూ.1.30 కోటీ వరకు | చదరపు అడుగుకు రూ.4,751 చొప్పున |

ట్రిపుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌లను చదరపు అడుగుకు రూ.4,751 చొప్పున విక్రయిస్తున్నారు. అమరావతి వంటి ప్రీమియం లొకేషన్‌లో, అందునా రాజధాని ఇన్నర్ రింగ్ రోడ్డు సమీపంలో, ఈ ధరలు స్థిరమైన నివాసాన్ని అందించడంలో కీలకపాత్ర పోషిస్తాయని భావిస్తున్నారు. నిర్మాణ కార్యక్రమాలు కేవలం నివాసాలకే పరిమితం కాలేదు. వచ్చే సంవత్సరం మార్చి నాటికి సెక్రెటేరియట్, మంత్రుల కేబిన్‌లు, విభాగ కార్యాలయాలు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్దేశించారు.

? ఐఎస్ సీనియర్ అధికారుల టవర్‌లు వేగంగా నిర్మిస్తున్నారు.

# పరకామణి కేసు

తిరుమల, నవంబర్ 20, రెండు కీలక కేసులు. వాటి చుట్టే రచ్చ. తిరుమల శ్రీవారి కొండంత రాజకీయం. అటు పరకామణి చోరీ కేసు..ఇటు కల్తీ నెయ్యి ఇష్యూ..రెండూ పీక్ లెవల్‌కు చేరుకున్నాయి. ఎన్నికలకు ముందు పరకామణి వివాదం రచ్చకెక్కితే..ఎలక్షన్ అయిపోయాక కల్తీ నెయ్యి ఎపిసోడ్ కాక రేపుతూ వస్తోంది. ఫైనల్‌గా రెండు కీలక కేసుల్లో దర్యాప్తు నెక్స్ట్ లెవల్‌కు చేరుకుంటోంది. పరకామణి చోరీ కేసు జఠిలం అవుతోందా? కల్తీ నెయ్యి కేసు లాస్ట్ స్టేజ్‌లో ఉందా? ఈ రెండు కేసుల్లో ఆ ఇద్దరే టార్గెట్టా?రెండు కీలక కేసుల చుట్టూ కొండంత వివాదం అవుతోంది. అసలే కోట్లాది మంది భక్తులు విశ్వసించే తిరుమల శ్రీవారికి సంబంధించిన ఇష్యూస్. ఒకటి పరకామణి చోరీ కేసు. రెండోది కల్తీ నెయ్యి ఘటన. పరకామణి చోరీ కేసు వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే పెద్ద వివాదం అయింది. అప్పట్లో అది సెటిల్ అయినా లేటెస్ట్‌గా మూడు నెలల నుంచి పెద్ద చర్చగా కొనసాగుతోంది. పరకామణి చోరీ చేసిన వ్యక్తి ఆస్తుల జప్తు..అతని ఆస్తులపై ఏసీబీ దర్యాప్తు ఇలా రోజుకో డెవలప్‌మెంట్ జరుగుతుండగానే..సాక్షి సీఐ సతీష్ మృతి చెందడంతో కేసు కొత్త టర్న్ తీసుకున్నట్లు అటు సతీష్‌ది ఆత్మహత్య అని వైసీపీ..హత్య అని టీడీపీ డైలాగ్ వార్‌కు దిగుతున్నాయి. టీడీపీ ఓ అడుగు ముందుకేసి వైసీపీ నేతలు భూమన కరుణాకర్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డే..సతీష్‌ను చంపించారని కూడా ఆరోపిస్తోంది. ఇంకా పోలీస్ దర్యాప్తు కొనసాగుతుండగానే..సతీష్ డెత్ మిస్టరీ చుట్టూ రాజకీయం రంకెళ్లు వేస్తోంది.మరోవైపు పరకామణి చోరీ కేసులో ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. విచారణకు హాజరయ్యేందుకు వెళ్తుండగా సీఐ సతీష్ కుమార్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంతో..ఈ కేసులో నిందితుడు రవికుమార్‌తో పాటు సాక్షులకు భద్రత కల్పించాలని హైకోర్టు స్పష్టం చేసింది. పరకామణి చోరీ కేసు విచారణ ముగిసే వరకు సాక్ష్యులకు ప్రొటెక్షన్ ఇవ్వాలని ఆర్డర్స్ ఇచ్చింది న్యాయస్థానం. అయితే వైసీపీ నేత భూమన కరుణాకరెడ్డి టార్గెట్‌గానే పరకామణి కేసు కొనసాగుతోందన్న టాక్ వినిపిస్తోంది. కూటమి

## టార్గెట్ కరణాకర్ రెడ్డి, వైవీ సుబ్బారెడ్డేనా

ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి..టీటీడీ పనితీరు బాలేదంటూ పదేపదే మీడియా ముందు వాలిపోతూ ఆరోపణలు, విమర్శలు చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే గోశాల, విష్ణుమూర్తి విగ్రహం ఇష్యూలో భూమన టీటీడీపై సీరియస్ అలిగేషన్స్ చేశారు. ఆ తర్వాత ఆయనపై కేసులు, నోటీసులు, విచారణ అంటూ హడావుడి నడిచింది.అయితే భూమన ఛైర్మన్‌గా ఉన్న సమయంలోనే పరకామణి కేసును ప్రైవేటు సెటిల్‌వెంట్ చేశారని..నిందితుడు రవికుమార్ ఆస్తుల విషయంలో ఏదో గోల్‌మాల్ ఉందన్న ఆరోపణలు వ్యక్తం చేస్తోంది టీడీపీ. ఈ క్రమంలోనే సతీష్‌ది ఆత్మహత్య అంటూ భూమన చేసిన వ్యాఖ్యలను కూడా టీడీపీ అస్త్రంగా వాడుకుంటుంది. సతీష్‌ది హత్యా? ఆత్మహత్యా? లేక ఆకస్మిక మరణమా అని పోలీసులు తేల్చకముందే ఆత్మహత్య అని భూమన ఎలా చెప్పగలుగుతున్నారని ప్రశ్నిస్తోంది. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు కూడా పరకామణి కేసుపై రియాక్ట్ అయ్యారు. పరకామణి కేసును నిష్పక్షపాతంగా విచారించాలని ప్రభుత్వానికి లేఖ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు.ఇక తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారంపై కూడా ఇప్పటికీ తీవ్ర దుమారం నడుస్తూనే ఉంది. గత ఎన్నికల తర్వాత వెలుగులోకి వచ్చిన కల్తీ నెయ్యి కేసు ఇప్పటికీ కాక రేపుతోంది. ఇప్పటికే వైవీ సుబ్బారెడ్డి మాజీ పీఏ అప్పన్న అరెస్ట్ అయ్యాడు. ఆయనను కస్టడీకి తీసుకుని సిట్ విచారించింది. వైవీతో సంబంధం ఎలా ఏర్పడింది? తిరుమల వ్యవహారాలతో మీకేం పని? అంటూ ఆరా తీసినట్లు తెలుస్తోంది. అప్పన్న బ్యాంకు ఖాతాలో రూ. 4.69 కోట్లు ఎలా జమయ్యాయని ప్రశ్నించినట్లు టాక్.తిరుమలకు నెయ్యి సప్లై..ఆర్డర్స్..వాటితో వైవీ సుబ్బారెడ్డికి ఏమైనా ప్రమేయం ఉందా అని కూపీ లాగారాట. ఇక ఇప్పటికే అప్పటి టీటీడీ ఈవో ధర్మారెడ్డిని సిట్ విచారించింది. ఈ క్రమంలోనే వైవీ సుబ్బారెడ్డికి కూడా సిట్ నోటీసులు ఇచ్చింది. అనారోగ్యంగా ఉన్నట్లు వైవీ.. అధికారులకు ఇన్ఫామ్ చేయడంతో..సిట్ అధికారులు హైదరాబాద్‌లోని ఆయన ఇంటికే వెళ్లి విచారించాలని నిర్ణయించారు. సిట్ విచారణలో వైవీ సుబ్బారెడ్డి ఏం చెప్పబోతున్నారు? సిట్ ఎలాంటి ప్రశ్నలు వేయనుందనే ఉత్కంఠ కొనసాగుతోంది. సిట్ విచారణలో వైవీ సుబ్బారెడ్డి పాత్ర ఉందని తేలితే మాత్రం ఈ కేసులో సంచలనాలు పక్కా. కల్తీ నెయ్యి వివాదంపై ఇప్పటికే కూటమి, వైసీపీ మధ్య మాటల యుద్ధం సాగుతోంది.పరకామణి కేసులో భూమన..ఇటు కల్తీ నెయ్యి కేసులో వైవీ సుబ్బారెడ్డి అలిగేషన్స్ ఎదుర్కొంటుండటం వైసీపీకి హెడెక్‌గా మారింది. పైగా ఈ ఇద్దరు నేతలు వైసీపీ అధినేతకు జగన్‌కు సన్నిహితులు. వైవీ సుబ్బారెడ్డి అయితే జగన్‌కు బాబాయ్ అవుతారు. ఈ ఇద్దరిని కార్నర్ చేసి..జగన్‌ను ఇరకాటంలో పెట్టేందుకు కూటమి స్కెచ్ వేస్తోందన్న టాక్ వినిపిస్తోంది. పరకామణి కేసు..ఇటు కల్తీ నెయ్యి ఎపిసోడ్‌లో రాబోయే రోజుల్లో ఎలాంటి డెవలప్‌మెంట్స్ ఉంటాయో చూడాలి.

# జగన్ కంచుకోటలో మౌనరాగం...

కడప నవంబర్ 20, (జగన్ సొంత ఇలాకా. ఒకప్పుడు వైసీపీదే హవా. గత ఎన్నికల నుంచి సీన్ మారిపోయింది. తొలి గడప కడపలో టీడీపీ సత్తా చాటుతూ వస్తోంది. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ బై ఎలక్షన్‌లో కూడా వైసీపీ పట్టు నిలుపుకోలేకపోయింది. ఇక ఓటమి తర్వాత ఫ్యాన్ పార్టీ లీడర్లంతా గప్ చుప్ అయ్యారట. ఒకరిద్దరు నేతలు తప్ప..మిగతా లీడర్లు అంతా సైలెంట్‌గానే ఉండిపోతున్నారట. జగన్ కంచుకోటలో నేతల మౌనరాగమెందుకు? మాజీ ఎమ్మెల్యేలు నియోజకవర్గాలను గాలికి వదిలేస్తే క్యాడర్ పరిస్థితి ఏంటివైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ సొంత జిల్లా కడప. రాష్ట్రమంతా ఒకఎత్తు.. కడప మాత్రం జగన్‌కు చాలా స్పెషల్. ఎందుకంటే అది ఆయన రాజకీయ క్షేత్రం. తాతలు, తండ్రుల కాలం నుంచి ఆధిపత్యం చలాయించిన ప్రాంతం. అధికారం ఉన్నా లేకున్నా జగన్ ఫ్యామిలీ, ఆయన అనుచరవర్గం గుప్పెట్లోనే ఉండేది కడప జిల్లా. కానీ గత ఎన్నికల్లో పవర్ పోయినప్పటి నుంచి పరిస్థితి మారిపోయింది. 2024లో ఓటమి తర్వాత..ఒకరిద్దరు మినహా కడప జిల్లాలోని మిగతా వైసీపీ లీడర్లంతా సైలెంట్‌గా ఉండిపోతున్నారట.అపొజిషన్ పార్టీ నేతలు కావాలనే సైలెంట్‌గా ఉంటున్నారా? లేక ఇప్పుడు లైమ్‌లైట్‌లో ఉండొద్దనే మౌనంగా ఉండిపోతున్నారా అన్న చర్చ జరుగుతోంది. ఉమ్మడి కడప జిల్లాలో పది అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంట్ సీట్లు ఉన్నాయి. 2014 నుంచి 2019 వరకు కడప జిల్లాలో మెజార్టీ స్థానాలు వైసీపీ ఖాతాలోనే ఉండేవి. 2014 ఎన్నికల్లో ఒక్క రాజంపేట మినహా అన్నింటా వైసిపి గెలిచింది. ఇక 2019 లో జిల్లా అంతా ఫ్యాన్ పార్టీ క్లీన్ స్వీప్. 2024లో ఉమ్మడి కడప జిల్లాలో మూడు సీట్లు మాత్రమే గెలిచింది వైసీపీ.సొంత జిల్లాలో ఓటమి కంటే నేతలు తన వెంట నిలబడకపోవడం జగన్‌కు నచ్చడం లేదట. పవర్‌లో ఉన్నప్పుడు అన్నీ అనుభవించి అధికారం కోల్పోగానే జిల్లా నేతలు పార్టీని గాలికొదిలేశారని క్యాడర్ గగ్గోలు పెడుతోంది. నడిపించే నేతల కోసం నియోజకవర్గాల్లోని క్యాడర్ ఆశతో ఎదురుచూస్తున్నారట. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావొస్తోంది. అయినా వైసీపీ అలర్ట్ అవ్వట్లేదన్న ఆరోపణలు సొంత పార్టీలో బలంగా వినిపిస్తున్నాయి.ఈ మధ్యే కడప జిల్లా అధ్యక్షుడిగా నియమించబడ్డ జగన్ మేనమామ రవీంద్రరెడ్డి, వెంపల్లి సతీష్ రెడ్డి మీడియాలో హడావుడికే సరిపోతున్నారట. ఇక కాంట్రవర్సీ కామెంట్స్‌తో అప్పుడప్పుడు ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి లైమ్‌లైట్‌లో ఉండే ప్లాన్ చేస్తున్నారట. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నా జమ్మలమడుగు వైసీపీ ఇంచార్జ్ ఎవరో తెగకపోవడంతో అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారట. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ తాను జగన్ దగ్గర ఎక్కువ కనిపిస్తూ సొంత పనులతో బిజీగా మారారని అంటున్నారు.మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి వయోభారంతో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. రాజంపేట ఎమ్మెల్యే ఆకెపాటి అమర్నాథ్ రెడ్డి కబ్జా ఆరోపణలు ఫేస్ చేస్తూ సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. బద్వేల్ ఎమ్మెల్యే దాసరి సుధా యాక్టీవ్‌గా పని చేయాలనుకంటున్నా లోకల్ పాలిటిక్స్ ఆమెకు హెడెక్‌గా మారాయట. ఇక రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, రాయచోటి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి ఇద్దరూ జగన్‌కు మంచి ఫ్రెండ్స్. ఈ ఇద్దరు నేతలు ఔట్ ఆఫ్ స్టేషన్ అన్నట్లుగానే ఉంటున్నారట. ఇక పులివెందుల వ్యవహారాలు ఎంపీ అవినాశ్, జగన్ కనుసన్నల్లోనే నడుస్తున్నాయి.ఒక్కో నేత తీరు ఒక్కో రకంగా ఉండటంతో జిల్లా క్యాడర్ అయోమయంలో పడిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. స్థానిక ఎన్నికలు దగ్గర పడుతున్న టైమ్‌లో నేతలు మౌనంగా అధినేతకు భారంగా మారిందట. ఇలాగే కొనసాగితే రాబోయే స్థానిక ఎన్నికల్లో మరోమారు ఫ్యాన్ పార్టీ పేలవమైనా ప్రదర్శన ఖాయమని కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారట. జిల్లాలో పార్టీని కాపాడాలని నేరుగా జగన్‌ను కలుస్తున్నారట లోకల్ లీడర్లు.

# వాసిరెడ్డికి దారేది...

## మూసుకుపోయిన దారులు

విజయవాడ, నవంబర్ 20, వైసీపీ నుంచి రాజీనామా చేసిన వారిని పార్టీలోకి తీసుకోవడానికి టీడీపీ పెద్దగా ఆసక్తి చూపడం లేదు. వైసీపీ అధికారం కోల్పోయిన వెంటనే మాజీ మహిళ కమిషన్ ఛైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ రాజీనామా చేశారు. అయితే ఆమె ఇప్పటి వరకూ ఏ పార్టీలోనూ చేరలేదు. త్వరలో టీడీపీలో చేరబోతున్నట్లు వెంటనే ప్రకటించారు.



గత ఏడాది డిసెంబరు నెలలో ఆమె రాజీనామా చేసినప్పటికీ ఇంత వరకూ టీడీపీలో వాసిరెడ్డి పద్మ టీడీపీలో చేరలేదు. డిసెంబరు నెలాఖరులోనే చేరాల్సిన వాసిరెడ్డి పద్మ టీడీపీ లో చేరలేకపోయారు. అయితే వాసిరెడ్డి పద్మ చేరికకు టీడీపీ నేతలు అభ్యంతరం పెద్దయెత్తున చెప్పారని తెలిసింది. వాసిరెడ్డి పద్మ మాటకారి. మంచి సబ్జెక్టు ఉన్న నేతగా పేరు. ప్రజారాజ్యం నుంచి ఆమె పార్టీకి అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారు. ప్రజారాజ్యంలోనూ ఎక్కువ రోజులు ఉండలేదు. తర్వాత ఆమె వైసీపీలో చేరి తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలనుకున్నారు. కానీ వైఎస్ జగన్ మహిళ కమిషన్ ఛైర్ పర్సన్ పదవి వరకే వాసిరెడ్డిని పరిమితం చేశారు. తనకు జగన్ అన్యాయం చేశారని, జగన్ తనకు చాలా బాకీ ఉన్నారని వాసిరెడ్డి పద్మ మీడియాతో పదే పదే చెబుతున్నారు. తాను పదిహేనేళ్ల నుంచి రాజకీయాల్లో ఉన్నప్పటికీ కనీసం ఎమ్మెల్సీ పదవి కూడా ఇవ్వలేదని వాసిరెడ్డి పద్మ వాదన. అందుకే తనకు వైసీపీ లో ఎదుగుదల లేదని భావించి తాను పార్టీకి రాజీనామా చేసి బయటకు వచ్చానని చెబుతున్నారు. జగన్ తనకు రాజకీయంగా అన్యాయం చేశారని వాసిరెడ్డి పద్మ అంటున్నారు. అయితే వైసీపీ నేతలు మాత్రం కేబినెట్ హోదా ఇచ్చినా ఆమెకు అంతకు మించిన పదవి కావాలంటే ఎలా? అని వేచి ఉండాలి కదా? అని అంటున్నారు.. కాపు సామాజికవర్గానికి చెందిన వాసిరెడ్డి పద్మ తొలుత జనసేనలో చేరాలనుకున్నారు. అయితే అప్పటికే జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను జనసేనలో చేరతారన్న ప్రచారంతో వాసిరెడ్డి పద్మ ఆ ఆలోచనను మానుకున్నారు. సామినేని జనసేనలో చేరడమే కాదు కృష్ణా జిల్లా పార్టీ అధ్యక్షుడయ్యారు. దీంతో ఆమె జనసేనలో చేరే ఛాన్స్ లేదు. అందువల్లనే ఆమె టీడీపీలో చేరేందుకు గ్రౌండ్ ప్రిపేర్ చేసుకున్నారు. విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేనిచిన్నిని కలిసి ఆయన ద్వారా పార్టీలో చేరాలని వాసిరెడ్డి భావించారు. మూడు సార్లు కేశినేని చిన్నితో వాసిరెడ్డి పద్మ సమావేశమయ్యారు. కేశినేని చిన్ని కూడా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తో మాట్లాడివర్క్ అవుట్ కాలేదని తెలిసింది. మొత్తం మీద వాసిరెడ్డి పద్మ దాదాపు ఏడాదిన్నర కాలంగా రాజకీయంగా దూరంగానే ఉంటున్నారు. మరి ఏ పార్టీ కూడా దరిదాపుల్లో చేర్చుకోదేమోనన్న ఆందోళన ఆమెలో కనపడుతుంది

# టిప్పర్ ఢీకొని మహిళ మృతి

సత్తెనపల్లి,సత్తెనపల్లి పట్టణంలోని ఐదు లాంతర్ల సెంటర్ వద్ద బుధవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. అతి వేగంగా వస్తున్న టిప్పర్ లారీ ఢీకొనడంతో కొటపాటి కృష్ణకుమారి (55) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందారని స్థానికులు తెలిపారు. మృతురాలు సత్తెనపల్లికి చెందిన కృష్ణకుమారిగా పోలీసులు గుర్తించారు. అనంతరం పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కామ్ గా మారిన గీత...

కాకినాడ, నవంబర్ 20, వైసీపీ నేత వంగా గీత ఎందుకో యాక్టివ్ గా లేరు. ఫైర్ బ్రాండ్ గా ముద్రపడిన వంగా గీత ఇప్పుడు రాజకీయంగా కామ్ అయిపోయారు. గత ఎన్నికల్లో పిఠాపురం నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అక్కడ పవన్ కల్యాణ్ బరిలో ఉండటంతో వంగా గీతను పిఠాపురం ప్రజలు ఆదరించలేదు. నాడు ముఖ్యమంత్రి హోదాలో జగన్ తాము అధికారంలోకి వస్తే వంగా గీతను ఉప ముఖ్యమంత్రి పదవిని కూడా చేస్తానని హామీ ఇచ్చినా వర్క్ అవుట్ కాలేదు. 2024 ఎన్నికల్లో దారుణ ఓటమి తర్వాత వంగా గీత పెద్దగా కనిపించడం లేదు. అప్పడప్పుడు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం మినహా పూర్తిస్థాయిలో యాక్టివ్ గా లేరన్నది వాస్తవం. 2019 ఎన్నికల్లో వంగా గీత కాకినాడ పార్లమెంటు నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ఐదేళ్లు బాగానే ఉన్నారు. అయితే ఆమెకు పార్లమెంటు కంటే శాసనసభలోకి ప్రవేశించాలన్న మక్కువే ఎక్కువ ఉంది. జగన్ కూడా పిఠాపురం నియోజకవర్గం కేటాయించడంతో పవన్ కల్యాణ్ తో హోరా హోరీ పోరాడారు. కానీ అవతల ఉన్నది పవన్ కల్యాణ్ కావడం, ఆయన అభిమానులు,సామాజికవర్గం ఓటర్లు పవన్ కు పక్కాగా ఓటేయడంతో వంగా గీత దారుణంగా ఓటమి పాలయ్యారు. ఇక పవన్ కల్యాణ్ పిఠాపురం నియోజకవర్గాన్ని తన అడ్డాగా మార్చుకున్నారు. ఆయన వచ్చే ప్రతి ఎన్నికల్లోనూ పిఠాపురం నుంచి బరిలోకి దిగుతారు.. పవన్ కల్యాణ్ పై పోటీ చేసి గెలుపొందడం కష్టమేనని భావిస్తున్న వంగా గీత తనకు వేరే నియోజకవర్గాన్ని అప్పగిస్తే బాగుంటుందన్నఅభిప్రాయంలో ఉన్నట్లు కనపడుతుంది. ఇక్కడ మళ్లీ పవన్ పై పోటీ చేసినా గెలుపు అనేది చాలా వరకూ కష్టమే కావడంతో ఆమె మరొక నియోజకవర్గానికి షిఫ్ట్ అవ్వాలని భావిస్తున్నారు. కానీ జగన్ నుంచి ఇప్పటి వరకూ దీనిపై క్లారిటీ రాకపోవడంతో వంగా గీత యాక్టివ్ గా లేరంటున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో మొన్నటి ఎన్నికల్లో పోటీ చేసి తాను తప్పు చేశానా? అన్న అంతర్మథనంలో వంగా గీత ఉన్నట్లు తెలుస్తోంది. వంగా గీత పిఠాపురంలోనూ పెద్దగా యాక్టివ్ గా లేకపోవడానికి ఇదే ప్రధాన కారణమని చెబుతున్నారు.



# వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా



**ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులను ఆరా తీసిన జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**
**సూపర్ స్పెషాలిటీ విభాగంలో ఉన్నా న్యూరాలజీ, యూరాలజీ ఓటి థియేటర్స్ పనులు డిసెంబర్ చివరి నాటికి పూర్తి కావాలి**



విభారే న్యూస్కర్నూలు, టౌన్ నవంబర్ 20:-వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా అని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులను ఆరా తీశారు. గురువారం స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో క్యాజువాలిటీ ఎమర్జెన్సీ వార్డు, మేల్ ఓపీ, క్రిటికల్ ఎమర్జెన్సీ వార్డు, సూపర్ స్పెషాలిటీ బ్లాక్, న్యూ డయాగ్నొస్టిక్ బ్లాక్ లను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముందుగా క్యాజువాల్టీ ఎమర్జెన్సీ వార్డులో ట్రీట్మెంట్ తీసుకుంటున్న చిన్న కేశవ, కొండయ్య, షేక్ ఫాతిమా, రామచంద్రుడు అనే పేషెంట్ బంధువులతో కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు ట్రీట్మెంట్ ఏ విధంగా ఇస్తున్నారు? ఎపుడు అడ్మిట్ అయ్యారు? ఏ కారణం చేత అడ్మిట్ అయ్యారు? సమయానికి మందులు వేస్తున్నారా? వైద్యులు సరిగా స్పందిస్తున్నారా? ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.. ధైర్యంగా ఉండాలని, వైద్యులు బాగా ట్రీట్మెంట్ చేస్తారని, త్వరగా కోలుకుంటారని కలెక్టర్ పేషెంట్ బంధువులకు ధైర్యం చెప్పారు.... జనరల్ మెడిసిన్ ఓపీ విభాగాన్ని పరిశీలిస్తూ శీతాకాలం కదా సీజనల్ రోగాలతో ఎవరైనా అడ్మిట్ అవుతున్నారా? ఎక్కువగా ఎలాంటి రోగాలతో అడ్మిట్ అవుతున్నారు? అనే విషయాలను జనరల్ మెడిసిన్ ఓపీ విభాగం వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు.. మేల్ ఓపీ ని పరిశీలిస్తూ కలెక్టర్ డాక్టర్ లతో మాట్లాడుతూ అడ్మిట్ అయిన పేషెంట్ కేస్ షీట్ వివరాలు సరిగా రాయాలన్నారు.. పేషెంట్లకు సంబంధించిన రిజిస్టర్, రోగ నిర్ధారణ (డయాగ్నోసిస్) ఐపి నెంబర్లు ఎంట్రీలు సరిగా చేయడం లేదని, ఎంట్రీలు సక్రమంగా చేయాలని కలెక్టర్ సంబంధించిన ఆర్థో విభాగపు వైద్యులను ఆదేశించారు... వైద్యులు ఓపి రిజిస్టర్ లను ప్రత్యేకంగా పెట్టుకొని పేషెంట్ ల వివరాలతో పాటు రోగ నిర్ధారణ (డయాగ్నోసిస్) వివరాలు కూడా రాయాలని తద్వారా ఏ కేసులు ఎక్కువగా వస్తున్నాయనే వివరాలు తెలుస్తాయన్నారు... ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఉన్న టాయిలెట్ లను మరమ్మతులు చేయించేందుకు ఎస్టిమేట్ లను సిద్ధం చేసి ఫైల్ పంపించాలని కలెక్టర్ ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ ను ఆదేశించారు.. సూపర్ స్పెషాలిటీ విభాగంలో ఉన్న న్యూరాలజీ, యూరాలజీ ఓటి థియేటర్స్ పనులు డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలన్నారు... అదే విధంగా స్క్రాప్ చాలా ఎక్కువగా ఉందని శుభ్రం చేసుకోకుండా ఎందుకు ఇలాగే పెట్టారని, వీటి ద్వారా ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశం ఉంటుందన్నారు.. స్క్రాప్ మొత్తం నెల లోపల తీసివేసి శుభ్రంగా పెట్టాలని కలెక్టర్ వైద్య అధికారులను ఆదేశించారు.. డయాగ్నొస్టిక్ బ్లాక్ లోని సిటీ స్కాన్ రూమ్ ను పరిశీలిస్తూ వివరాలను కలెక్టర్ సూపరినీటెండెంట్ ను అడిగి తెలుసుకున్నారు...ఆసుపత్రి వైద్యులు సమయపాలన, ఎఫ్ఆర్ఎస్ కు సంబంధించిన వివరాలు గురించి, న్యూ డయాగ్నస్టిక్ బ్లాక్ లోని ఉన్న క్రిటికల్ కేర్ బ్లాక్ పనుల గురించి కలెక్టర్ సంబంధిత అధికారులతో ఆరా తీశారు...అనంతరం కర్నూలు మెడికల్ కళాశాల విద్యార్థినుల వసతి గృహాన్ని తనిఖీ చేశారు..వారితో ప్రత్యేకంగా మాట్లాడి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని కలెక్టర్ వారితో అడిగి తెలుసుకున్నారు..కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరినీటెండెంట్ డా.వెంకటేశ్వర్లు, డిప్యూటీ సూపరినీటెండెంట్ లక్ష్మీ బాయ్, అడ్మినిస్ట్రేషన్ అధికారి సింధు సుబ్రమణ్యం, వైద్యులు తదితరులు పాల్గొన్నారు ..

## టిడిపి బలోపేత దిశగా భేటీ--

**కౌన్సిలర్ ఎన్నికల విజయమే లక్ష్యంగా శ్రేణులకు పిలుపు--**






విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 20-నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ఆహ్వాన మేరకు గురువారం నంద్యాల టౌన్ సురభి హోటల్ లో బ్రేక్ ఫాస్ట్ సమావేశం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నంద్యాల పట్టణంలోని 42 వార్డుల యూనిట్ ఇన్ చార్జీలు, క్లస్టర్ ఇన్ చార్జీలు, వార్డు ఇన్ చార్జీలు భారీగా హాజరై పార్టీ బలోపేతంపై విశదంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ రాబోయే కౌన్సిలర్ ఎన్నికలకు ఇప్పటి నుంచే ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. నంద్యాల టౌన్ మున్సిపాలిటీని తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకోవడమే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. అందరూ ఏకమై సమిష్టి కృషితో పార్టీ విజయం కోసం నిరంతరం పనిచేయాలని సూచించారు. బూత్ స్థాయి సమన్వయం, ఇంటింటి ప్రచారం బలోపేతం చేసి ప్రజలతో అనుబంధాన్ని మరింత పటిష్ఠం చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నందమూరి నగర్, వైయస్సార్ నగర్ 38వ వార్డు టిడిపి ఇన్ చార్జ్ దేరెడ్డి శివనాగిరెడ్డి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పార్టీ పటిష్ఠానికి ఆయన చేస్తున్న కృషి, చురుకైన నాయకత్వాన్ని నేతలు ప్రశంసించారు. ఆయన సూచనలు కార్యకర్తలకు మార్గదర్శకంగా నిలిచి కార్యక్రమానికి మరింత ప్రాధాన్యం చేకూర్చాయి. సమావేశం మొత్తం టిడిపి శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. రానున్న ఎన్నికల్లో విజయం సాధించే దిశగా స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగేందుకు నాయకులు సన్నద్ధత వ్యక్తం చేశారు. నంద్యాలలో తెలుగుదేశం పార్టీ పట్టు మరింత బలపడేలా ఈ భేటీ కీలకంగా నిలిచింది.

## కేంద్ర నిధుల పూర్తి వినియోగంతో నంద్యాల అభివృద్ధి వేగవంతం--

**జాప్యం లేకుండా పనుల పూర్తి దిశా కమిటీ స్పష్టం--**




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 20-కేంద్ర ప్రభుత్వ పథకాలకు కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని నంద్యాల పార్లమెంట్ సభ్యులు, దిశ కమిటీ చైర్మన్ బైరెడ్డి శబరి అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్ సెంటినరీ హాలులో జరిగిన దిశ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. మంజూరైన పనులు సకాలంలో పూర్తి చేయాలని, నిధులు వెనక్కి వెళ్లకుండా సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఎంపీ సూచించారు. ముఖ్యంగా విద్యాశాఖలో పాడైన భవనాల మరమ్మతులు, తరగతి గదుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. రైతుల కోసం భూసార పరీక్ష కేంద్రాల వినియోగాన్ని పెంచాలని, వ్యవసాయ పథకాల కింద 60 శాతం వాటాను పూర్తిగా ఖర్చు చేసి లాభాలు చేకూర్చాలని తెలిపారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి నీటి సరఫరా పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖలో పెండింగ్ ఏబీహెచ్ఏ కార్డుల పంపిణీ వేగవంతం చేయాలని, విలేజ్ హెల్త్ క్లినిక్స్ సౌకర్యాల మెరుగుపరచాలని సూచించారు. రహదారి మరమ్మతులు నాణ్యతతో చేపట్టాలని, హైవే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా మాట్లాడుతూ కేంద్ర పథకాల అమలును కఠినంగా పర్యవేక్షించి నిర్ణీత కాలంలో పూర్తి చేస్తామని తెలిపారు. భూసార పరీక్షలపై రైతులకు అవగాహన పెంచి పంటల ఎంపికలో శాస్త్రీయ సూచనలు అందిస్తామని చెప్పారు. కోల్డ్ స్టోరేజీల విస్తరణతో రైతులకు అదనపు లాభాలు చేకూరుతాయని వివరించారు. ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి 340సి పనులు నాణ్యతతో జరిగేలా చూడాలని, జల్ మార్గ్ వికాస్ ప్రాజెక్ట్ ద్వారా పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

## టీవీ టెక్నీషియన్లకు ఇంటి స్థలాలపై మంత్రి ఫరూక్ హామీ--

**నంద్యాల అసోసియేషన్ వినతికి సానుకూల స్పందన--**

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 20-నంద్యాల టీవీ టెక్నీషియన్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అర్హులైన టీవీ టెక్నీషియన్లకు ఇంటి స్థలాలు కేటాయించాలని వినతిపత్రం సమర్పించారు. మెప్మా ద్వారా శిక్షణ పొంది జీవనోపాధి సాగిస్తున్న టీవీ టెక్నీషియన్లలో అనేక మంది పేదవర్గాలకు చెందినవారని, వారికి ఇంటి స్థలాలు కేటాయించడంతో పాటు మెప్మా ద్వారా రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ గౌరవాధ్యక్షులు డా. రవికృష్ణ, అధ్యక్షులు కన్నయ్య, పట్టణ సంఘం అధ్యక్షులు జయపాల్ మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ అర్హులైన వారికి తప్పనిసరిగా ఇల్లు లేదా ఇంటి స్థలాలు కేటాయించేలా ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. తమ వినతికి సానుకూలంగా స్పందించిన మంత్రికి అసోసియేషన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీవీ టెక్నీషియన్ అసోసియేషన్ కార్యదర్శి వెంకట శివయాదవ్, ఉపాధ్యక్షులు మహబూబ్ బాషా, సంయుక్త కార్యదర్శి ఎల్లా గౌడ్, కోశాధికారి వీరారెడ్డి, సహకోశాధికారి కిషోర్ కుమార్, గౌరవ అధ్యక్షులు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.




## విస్తృతంగా ఆప్టా సభ్యత్వ నమోదు..



విభారే న్యూస్ నవంబర్ 20 ఎమ్మిగనూరు..గురువారం రోజు ఎమ్మిగనూరు మండలం రాం నగర్, గుడికల్,ఆస్పరి మండలం లోని పలు గ్రామాల్లోనీ పాఠశాల ల యందు ఎ పి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) సభ్యత్వ నమోదు కార్యక్రమం విస్తృతంగా జిల్లా అధ్యక్షుడు ఎం మధుసూదన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సేవా లాల్ నాయక్ ఆధ్వర్యం లో చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం విద్యా రంగ సమస్య ల పై ఆప్టా నాయకుల స్పందన పరిష్కారము చేస్తున్నందున రాష్ట్రం లో ఎ పి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ ( ఆప్టా) వేగంగా విస్తరిస్తుందని, వాస్తవంగా ఈ సంఘము రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు ను 1969 లో పొందిన మొట్ట మొదటి ఉపాధ్యాయ సంఘం. ప్రస్తుతం ఈ సంఘము సమర్థమైన నాయకత్వం లో ముందుకు వెళుతుంది. కాబట్టి జిల్లా యందు ఉపాధ్యాయులకు ఎదురయ్యే వృత్తి పరమైన ఎట్టి సమస్య లకు అయిన పరిష్కారం చూపిస్తామని అన్నారు. సమస్యలు ఏమైనా వచ్చిన అప్టా జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి ఫోన్ నెంబర్:9704040543 ఆప్టా జిల్లా ప్రధాన కార్యదర్శి, కర్నూలు జిల్లా ఫ్యాప్టో చైర్మన్ సేవా లాల్ నాయక్ ఫోన్ నెంబర్ 9550855099 ను ఎప్పుడూ అయిన సంప్రదించవచ్చు అన్నారు. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం లో కర్నూలు జిల్లా ఆర్థిక కార్యదర్శి వినోద్ పాల్గొన్నారు.

## ఎం టి యూ 1426 వరి లాభదాయకం

**--కొత్తపల్లిలో క్షేత్ర దినోత్సవం---**



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 20-నంద్యాల మండలం కొత్తపల్లి గ్రామంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం నంద్యాల మరియు ఏరువాక కేంద్రం కర్నూలు ఆధ్వర్యంలో ఎం టి యూ 1426 నూతన వరి రకం పై క్షేత్ర దినోత్సవం ఘనంగా జరిగింది. మారుటేరు పరిశోధన కేంద్రం రూపొందించిన ఈ వంగడం రెండవ సంవత్సరం మినికిట్ పరిశీలనలో ఉండి రైతుల నుంచి మంచి స్పందన పొందుతోంది. ముఖ్య అతిథి డా ఎం జాన్సన్ మాట్లాడుతూ ఈ రకం అధిక దిగుబడి, ఎక్కువ పిలకలు, తక్కువ తెగుళ్ల ప్రభావం వంటి లక్షణాలతో రైతులకు అనుకూలమని తెలిపారు. సాగులో శాస్త్రీయ పద్ధతులు, ఎరువుల సమతుల్య వినియోగం, పురుగు నియంత్రణపై అవగాహన కల్పించారు. డా వి సుజాతమ్మ ఈ వరి రకం తక్కువ ఖర్చుతో సాగు చేయగల సామర్థ్యం కలిగినదిగా వివరించారు. డా రవి ప్రకాష్ రెడ్డి, డా మంజునాథ్, డా వెంకట రమణమ్మ, డా బాలాజీ నాయక్ లు వరి సాగులో యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నియంత్రణ, భూసార పరీక్షల ఆధారిత ఎరువుల వినియోగంపై సూచనలు ఇచ్చారు. డీడీఏ మద్దిలేటి, మండల వ్యవసాయ అధికారి ప్రసాద్ రైతులు నూతన వంగడాలను అనుసరించి అధిక దిగుబడులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## మార్క్ ఫెడ్ ప్లాంట్లో ఇన్నోవేషన్ చర్చలు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 20-సహకార వారోత్సవాలలో భాగంగా నవంబర్ 14 నుంచి 20 వరకు జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజైన 20న మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో జిల్లా సహకార అధికారి సారథ్యంలో మార్క్ ఫెడ్ ప్లాంట్ ఆవరణలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. సహకార వ్యవస్థలో నూతన ఆవిష్కరణల ద్వారా ప్రపంచ స్థాయిలో పోటీతత్వం పెంపే లక్ష్యంతో చర్చలు నిర్వహించారు. నానో టెక్నాలజీ వినియోగం, నానో యూరియా నానో డీఏపీ ద్వారా పంటల రక్షణ అంశాలపై కోరమండల్ ప్రతినిధులు వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి, డివిజనల్ సహకార అధికారి, డీఎం మార్క్ ఫెడ్, జిల్లా వ్యవసాయ అధికారి, సహకార శాఖ సిబ్బంది, పీఏసీఎస్, మార్క్ ఫెడ్, డీసీఎంఎస్ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**